సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 6 । మార్చి । 2023



సర్వమత సన్నిధి.. నీలకంఠరావుపేట దర్గా

రామాపురం మండలం నీలకంఠరావుపేట సమీపంలోని దర్గా హిందూ, ముస్లిం సమైక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. - 8లో



కారుబైక్ ఢీ: ఒకరి మృతి

రైల్వేకోడూరు మండలం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. - 8లో

మదనపల్లె: టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.210
రెండోరకం	రూ.90	రూ.168

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు: 206 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ప్రతి సోమవారం మల్లయ్య కొండకు ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రమైన తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ 1డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. రెండు సర్వీసులు ఉదయం 5, 6 గంటలకు మదనపల్లె నుంచి నేరుగా మల్లయ్యకొండ పైకి వెళతాయన్నారు. తంబళ్లపల్లె పాత బస్టాండు నుంచి మల్లయ్యకొండకు ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సులు నడుస్తాయని ఆయన తెలిపారు.

నేడు తిరువణ్ణామలైకు ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ జిల్లాలోని వివిధ డిపోల నుంచి సోమవారం తిరువణ్ణామలైకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు.

11న కనుమలో గంగమ్మ జాతర

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని కనుమలో గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా 11న రాత్రి తిరునాల, 12న పగలు తిరునాల జరుగుతుందని దేవదాయశాఖ ఈఓ రమణ తెలిపారు. 11న రాత్రి అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. చాందినీబండ్లు ఊరేగింపు, పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 12న ఉదయం పగలు తిరునాల జరుగుతుందన్నారు. సాయంత్రం ఉట్ల తిరునాలతో జాతర ముగుస్తుందని పేర్కొన్నారు.

రామయ్యకు వెండి పంచ పాత్రలు సమర్పణ

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో వెలసిన శ్రీ సీతారామలక్ష్మణులకు వంశీ కృష్ణ అనే భక్తుడు వెండి పంచ పాత్రలను సమర్పించినట్లు ఆదివారం ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదులోని మలక్‌పేటకు చెందిన వంశీ కృష్ణ అనే భక్తుడు దాదాపు రూ. 2 లక్షలు విలువ చేసే వెండి పంచపాత్రలను స్వామి వారికి సమర్పించారన్నారు. ఆ వెండి ఆభరణాలకు శాస్త్రోక్తంగా పూజలు చేసి, ఆలయ అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

కనుల పండువగా లక్ష్మీనరసింహుని కల్యాణం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన ఆదివారం వేకువ జామునే మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ నిర్వహించారు. తిరుచ్చిలో స్వామివారిని అలంకరించి గ్రామోత్సవం జరిపారు. ఆలయ మండపంలో మూలవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా చేశారు. అనంతరం కల్యాణోత్సవ ఏర్పాట్లు చేశారు. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా నిర్వహించారు. రూ. 300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం వాహన మండపంలో అందంగా అలంకరించిన గరుడ వాహనంపై కొత్త దంపతులు కొలువుదీరి మేళతాళాలతో కోలాటాలు, చెక్కభజనల మధ్య పురవీధుల గుండా ఊరేగారు.

రామమూర్తి.. యువతకు స్ఫూర్తి!

SAKSHI SPECIAL

పోలీసు అనే పదం వింటేనే విద్యార్థులకు ఒక రకమైన భయం. తప్పు చేస్తే కఠినంగా శిక్షిస్తారనే భావన వారి మెదడులో కదలాడుతుంది. అయితే పోలీసు అంటే భయపడాల్సిన అవసరం లేదు అని నిరూపిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు ఈ పోలీసు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించడం కోసం మిమిక్రీతో కూడిన ప్రేరణా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆయనే మదనపల్లె టు టౌన్ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ దాసరి గోవింద రాజులు రామమూర్తి. ఆయన సేవలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం
- పాఠశాల,కళాశాలల్లో వేలాది ప్రేరణా కార్యక్రమాలు
- ఆదర్శప్రాయుడు హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి

మదనపల్లె సిటీ: డాక్టర్ సుధారామమూర్తి లేదంటే నిక్‌ఉజిసిక్ ...వాళ్లిద్దరూ దొరకకపోతే యండమూరి లేదా ప్రముఖ సినీనటులు ఉన్నట్టుండి పాఠశాల తరగతి గదిలోకి వచ్చి పాఠాలు చెబితే విద్యార్థులు ఎగిరిగంతులేసి.. బుద్ధిగా హుషారుగా వినరూ.. ఇంతంటి ప్రముఖులు పాఠశాలకు రావడం జరగదు. కానీ వారందరి గొంతులను అనుకరించే పోలీసు రామమూర్తి మాత్రం వస్తారు. అచ్చం ప్రముఖులు మాట్లాడినట్లే మాట్లాడుతూ ...మిమిక్రీని మిక్స్ చేసి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసాన్ని బోధిస్తున్న ఈయన అందరి మన్ననలను పొందుతున్నారు. నిత్యం బిజీగా ఉండే ఉద్యోగంలో అంత తీరిక ఎక్కడుంటుంది? అని ఈ పోలీసును ప్రశ్నిస్తే .. జీవితంలో ప్రతి మనిషికీ ఏదో ఒక లక్ష్యం ఉంటుంది. నా లక్ష్యం మాత్రం విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం అంటారు. ఒక పోలీసుగా నేరస్తుల బాల్యం వారి జీవితం ఎలా ఉంటుందో నాకు బాగా తెలుసు. బాల్యంలో పడే బీజమే పిల్లల వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తుంది.



విద్యార్థులతో వ్యక్తిత్వ వికాసంపై మాట్లాడుతున్న రామమూర్తి

వారిని సన్మార్గంలో తీసుకెళుతుంది. నేరప్రవృత్తిని తగ్గిస్తుంది. వారి ఉజ్వల భవిష్యత్తు తీర్చిదిద్దుతుంది. అందుకే మిమిక్రీ, ప్రేరణ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే కొత్త ప్రక్రియను చేపట్టాను. విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి మంచి స్పందన వస్తోంది. దీంతో అందరూ నన్ను పోలీసు రామమూర్తి బదులు మోటివేషనల్ స్పీకర్ రామమూర్తి, మిమిక్రీ రామమూర్తి అని పిలుస్తున్నారు అంటున్నారు.

విద్యార్థుల చదువులకు సహకారం:

ఓ వైపు విద్యార్థులకు ప్రేరణా కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరో వైపు మెడికల్ క్యాంపుల నిర్వహణ, విద్యార్థులకు స్టడీ మెటీరియల్, క్రీడా పరికరాలు, పేద విద్యార్థులకు దాతల సహకారంతో స్కాలర్‌షిప్ పంపిణీ లాంటి కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తున్నారు. పూర్వ విద్యార్థులతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రామమూర్తి

మరిచిపోని సంఘటన

నేను అప్పుడే డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చి యూనిఫాం తీసేస్తున్నాను. అంతలో ఒక పెద్దాయన వచ్చి 'సార్ నా కూతురు మరో వారం రోజుల్లో పరీక్షలు రాయాలి. ఎవరు ఎంత చెప్పినా పరీక్షల భయం పోవడం లేదు. చాలా ఒత్తిడికి గురవుతోంది.ఇలాంటి పిల్లల్ని మీ వద్దకు తీసుకొస్తే ఒత్తిడిని తగ్గిస్తారని, బాగా నవ్విస్తారని ఎవరో చెబితే ఇలా వచ్చాను' అన్నాడు. అప్పుడు నేను ' ఆ అమ్మాయిని మీరు మా ఇంటికి తీసుకురావడం కాదు. నేను మీ ఇంటికి వస్తాను. పదండి పోదాం..' అని వెంటనే బయలుదేరాను. మిమిక్రీతో ఆ పాప భయాన్ని తొలగించి వచ్చాను. ఇది నిజంగా నా జీవితంలో మరచిపోలేని సంఘటన అన్నారు ఈ స్ఫూర్తిదాయక హెడ్ కానిస్టేబుల్.

ఎన్నో అవార్డులు

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రామమూర్తి తన కార్యక్రమాల ద్వారా ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారు.

- 2002లో హైదరాబాదులో జరిగిన పోలీసుశాఖ సాంస్కృతిక కార్యక్రమాలు, 2003లో అనంతపురంలో జరిగిన పోలీసు డ్యూటీమీట్‌లో మిమిక్రీ ప్రదర్శనకు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.
- 2003లో కుప్పం ద్రవిడ యూనివర్సిటీ జాతీయ యువజన ఉత్సవాల్లోనూ... 2004 హైదరాబాదులో జరిగిన నాటిక పోటీల్లో మిమిక్రీ ప్రదర్శన ద్వారా ప్రశంసలు అందుకున్నారు. బెంగళూరులో జరిగిన కర్ణాటక, తెలుగు అకాడమీ ఉత్సవాల్లో సినీనటుడు రాజేంద్రప్రసాద్ నుంచి అవార్డు అందుకున్నారు.
- 2004 అక్టోబర్‌లో చెన్నైలో జరిగిన ఆంధ్ర సొసైటీ ఉత్సవ కార్యక్రమంలో అవార్డును సొంతం చేసుకున్నారు.
- 2015లోఅగస్త్య ఫౌండేషన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చే ప్రశంసలు అందుకున్నారు.

చైతన్యపరిచే పోలీసు...

చిత్తూరు జిల్లా వి.కోట మండలం జవునిపల్లె వాసి రామమూర్తి. తండ్రి దాసరి గోవిందరాజులు రైతు. తల్లి దాసరి నారాయణమ్మ సాధారణ గృహిణి. పాఠశాల విద్య అదే మండలంలో పూర్తి చేసి పలమనేరులో ఇంటర్, డిగ్రీ కోర్సులు పూర్తి చేశారు. 1992లో పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. కళాశాల రోజులలో మిమిక్రీ నేర్చుకున్న ఆయన మొదటగా 2006లో గురుకుల పాఠశాల విద్యార్థులలో ఒత్తిడిని తగ్గించి వారిని పరీక్షలకు సన్నద్ధం చేయడం కోసం ప్రేరణా కార్యక్రమం నిర్వహించారు. సినీనటులు చిరంజీవి, ఎన్టీఆర్, కృష్ణ, మోహన్‌బాబు, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ వంటి నటులతో పాటు రాజకీయ నాయకులను అనుకరించే మిమిక్రీ చేస్తూ అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. అదే స్ఫూర్తితో ఇప్పటి వరకు వేలాది కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు బంగారు బాట వేస్తున్నారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత, చెడు వ్యసనాలతో జరిగే దుష్పరిణామాలపై తరచూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు పోలీసుశాఖపరంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు హెల్మెట్ అవేర్‌నెస్, ట్రాఫిక్ అవేర్‌నెస్, సైబర్ క్రైం, లోన్‌యాప్స్, ఫ్యామిలీ కౌన్సెలింగ్, ఫ్రెండ్లీ పోలీసు, యాంటీ డ్రగ్స్ డ్రైవ్‌లకు సంబంధించి కార్యక్రమాలను నిర్వహిస్తూ అందరిచే శభాష్ పోలీసు అనిపించుకుంటున్నారు. నెల్లూరుకు చెందిన ప్రముఖ సైకాలజిస్టు కరిమెద్దల నరసింహారెడ్డి , ప్రముఖ సైకాలజిస్టు పట్టాభిరామ్ తనకు స్ఫూర్తి అంటున్నారు రామమూర్తి.



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షల ఫోబియా గురించి తెలియజేస్తున్న రామమూర్తి

యాంత్రిక జీవనం నుంచి బయటపడాలి

విద్యార్థులు యాంత్రిక జీవనాన్ని వదిలి బయట రావాలి. చిన్నప్పటి నుంచే మానసిక వికాసం, సేవా గుణం అలవర్చుకోవాలి. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలి. ర్యాంకులే జీవితం అనే ధోరణి నుంచి బయట పడాలి. పిల్లల సర్వతోముఖాభివృద్ధి కోసం తల్లిదండ్రులు తగు సమయాన్ని కేటాయించాలి. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకూడదు.

–దాసరి గోవిందరాజులు రామమూర్తి, హెడ్ కానిస్టేబుల్, మదనపల్లె

మహిమగల రాత్రి 'షబ్–ఏ–బరాత్'

రేపు షాబాన్ పర్వదినం

మదనపల్లె సిటీ: ఇస్లాం కాలమానంలోని 8వ నెల షాబాన్. ఈ మాసంలోని 15వ రాత్రిని పురస్కరించుకుని ముస్లింలు జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి 'షబ్–ఏ–బరాత్' పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ పర్వదినాన్ని వ్యావహారిక భాషలో 'పెద్దల పండుగ'గా పిలుస్తారు. ఈ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. తమ పూర్వీకుల ఆత్మశాంతి కోసం ముస్లింల ఖబర్‌స్థాన్‌కు(శ్మశానవాటిక) వెళ్లి 'మగ్ఫిరత్ కి దువా' చేస్తారు. రజబ్, రంజాన్ మాసాల మధ్యలో వచ్చే షాబాన్ మాసం మానవులను పాపాల నుంచి దూరం చేస్తుందని దివ్య ఖురాన్ చెబుతోంది. ఈ మాసంలో ముస్లింలు చేసే పనులు, ప్రార్థనలు, దానధర్మాలు అల్లాహ్ దృష్టికి వెళతాయి. ఈ మాసం మన కర్మఫలాలు దైవం దగ్గరకు తీసుకెళ్లే మాసమని మహా ప్రవక్త హజరత్ మహమ్మద్ పేర్కొన్నారు. ఈ మాసంలో కూడా ముస్లింలు నఫిల్ ఉపవాసాలు చేపడతారు. మహాప్రవక్త హజరత్ మహ్మద్ సందేశాన్ని వ్యాప్తి చేసిన హజ్రత్ ఆయిషా దగ్గరకు ఒకసారి ఒక మహిళ వచ్చి రంజాన్‌తో పాటు ఏఏ నెలలో మనం ఉపవాసదీక్షలు పాటించవచ్చు అని ప్రస్తావించింది. ' ఒక వేళ నీకు రంజాన్ మాసంలో ఉపవాసాలు చేశాక, వేరే మాసంలోనూ ఉపవాసదీక్షలను పాటించాలని ఉంటే... షాబాన్ మాసంలో పాటించు. ఈ మాసంలో కలిగే అనేక శుభాలను పవిత్ర గ్రంథంలో వివరించారు అని ఆయిషా బదులివ్వడం జరిగింది. ఈ నెలలో శుభాలు, పుణ్యాలు లభిస్తాయి. రంజాన్ మాసాన్ని స్వాగతించడానికి తమను తాము సిద్ధం చేసుకోవాలి. చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెందాలి. ఎక్కువగా ప్రార్థనలు చేసి, దైవ సామీప్యాన్ని పొందాలి అని మహనీయులు పేర్కొన్నారు. 'షబ్–ఏ–బరాత్' రాత్రి అల్లాహ్ తను సృష్టించిన జీవరాశులన్నింటినీ ప్రత్యేకంగా అనుగ్రహిస్తారని, పాపాలను క్షమిస్తాడని, దివ్య ఖురాన్ చెబుతోంది. 'షబ్–ఏ–బరాత్'ను నరకం నుంచి విముక్తి కలిగించే రాత్రి, శుభాల రాత్రి అంటారు.



మదనపల్లెలోని జామియా మసీదు

'మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు

జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, వాల్మీకిపురం, బి.కొత్తకోటతో పాటు ముస్లింలు గణనీయంగా ఉండే ప్రాంతాల్లోని మసీదులలో మంగళవారం రాత్రి 10 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. మదనపల్లెలోని జామియా , సల్మాన్ ఫార్సీ మసీదులలో రాత్రి 10 గంటకు ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ సర్‌ఖాజీ హాఫిజ్ సయ్యద్ ఇక్బాల్ అహ్మద్ తెలిపారు.

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా ఉండండి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.కొండయ్య



వైద్యసిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: సైకిల్ తొక్కి శ్రమించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.కొండయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో 'సైకిల్ తొక్కండి..ఆరోగ్యంగా ఉండండి' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శారీరక శ్రమతో కూడిన సైకిల్ తొక్కడం, ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడం, యోగా, జిమ్ తదితర వ్యాయామాలు చేయడం ద్వారా రక్తపోటు, షుగర్ తదితర వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ సర్వేలెన్స్ ఆఫీసర్ రియాజ్‌బేగ్, సీహెచ్‌ఓ నారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్‌లు బలరామరాజు, రాజగోపాల్, హెల్త్ సూపర్ వైజర్లు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్ పాల్గొన్నారు.

అంకెల్లో ఓటు.. అదే చెల్లుబాటు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఇలా..
- అక్షరాలు, గుర్తులు చెల్లవు
- బ్యాలెట్ పేపర్ విధానంలో ఓటింగ్
- ఎంస్వీప్ యాప్‌తో అవగాహన

బద్వేలు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు సమయం దగ్గర పడింది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ విధానంపై చాలా మందికి అవగాహన ఉంది. గుర్తులు ఉంటాయి. ఈవీఎంలను ఓటింగ్‌కు వినియోగిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్యాలెట్ పేపరు వాడతారు. అందులో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులపై స్వస్తిక్ గుర్తును వేసి ఓటు వేస్తారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం పూర్తి భిన్నంగా ఉంటుంది. అభ్యర్థులకు ప్రాధాన్యత ఓటు వేస్తారు. ఒక్కో ఓటరు తన ప్రాధాన్యతను బట్టి అభ్యర్థులందరికీ ఓటు వేసే అవకాశం ఉంటుంది. వీటిని కూడా అంకెల్లో వేయాలి.

బ్యాలెట్‌పై గుర్తులుండవు


పట్టభద్రులకు సంబంధించి పేర్లను గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర, రిజిస్టర్డ్ జాతీయ, రాష్ట్ర పార్టీ, తదుపరి స్వతంత్ర అభ్యర్థులకు అక్షర క్రమంలో వరుస సంఖ్య కేటాయిస్తారు. ఉపాధ్యాయ అభ్యర్థులందరూ స్వతంత్రులే కాబట్టి వారికి అక్షర క్రమం ప్రకారం వరుస కేటాయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల పేర్లు, వాటికెదురుగా ఖాళీ బాక్స్‌లు ఉంటాయి. వీటిలో అంకెల్లో ఓటు వేయాలి. అంకెల్లో కాకుండా అక్షరాలు, టిక్ మార్క్, ముద్రలు వేస్తే చెల్లదు. ఓటరు ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థులందరికీ ఓటు వేయచ్చు. ఓటు విధానంపై మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో కార్యక్రమాలను అధికార యంత్రాంగం చేపట్టింది.



ఎంస్వీప్ యాప్ ముఖచిత్రం

ఓటు వేయడమిలా..


- పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల సిబ్బంది అందుబాటులో ఉంచిన వంగపూత (వైలెట్) రంగు స్కెచ్ పెన్‌తో ఓటు (నెంబర్) వేయాలి. ఇతర పెన్నులను ఉపయోగించరాదు.
- ఓటరు తాను ఓటు వేయదలచుకున్న అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో నెంబర్ వేయాలి.
- ఓటరు తనకు నచ్చిన అభ్యర్థులకు తాను ఇచ్చే ప్రాధాన్యతను బట్టి వారికి 1, 2, 3, ... నెంబర్లు వేయవచ్చు.
- అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న గడి దాటకుండా నెంబరు వేయాలి. నెంబరులను 1, 2, 3...లలో లేదా రోమన్ నెంబరులలో కూడా వేయవచ్చు.



ఓటు వేయాల్సిన విధానంపై పోస్టర్

ఇలా చేస్తే చెల్లదు

- ఒకే నెంబరును ఇద్దరు అభ్యర్థులకు వేయకూడదు
- ఒక అభ్యర్థికి ప్రాధాన్యత ఓటు నెంబరులో వేసి మరొకరికి ముద్ర రూపంలో వేయకూడదు
- ప్రాధాన్యత ఓటు నెంబరులలో కాకుండా అక్షరాల్లో వేయకూడదు.
- ప్రాధాన్యత ఓటు 1 వేయకుండా మిగిలిన నెంబర్లు వేయకూడదు.
- అభ్యర్థి ఎదురుగా గడిలో అంకె బదులు రైట్, ఇంటు వంటి ఎటువంటి టిక్కులను వేయకూడదు.
- ఒకే అభ్యర్థికి రెండు ప్రాధాన్యత ఓట్లు వేయకూడదు.



ఓటు వేయకూడని విధానంపై పోస్టర్

- అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలోనే ఓటు వేయాలి. గడిలో కాకుండా ఇతర ఏ ప్రాంతాల్లో వేసినా చెల్లదు.
- బ్యాలెట్ పేపరును సిబ్బంది సూచించిన విధానంలోనే మడత వేయాలి.

పారేశమ్మా.. శభాషమ్మా!

- వాటర్ ఉమన్ పారేశమ్మకు మరో గుర్తింపు
- 2021లో జాతీయ వాటర్ ఛాంపియన్ అవార్డు
- తాజాగా స్వచ్ఛ సుజల్ శక్తికి అభివ్యక్తి నివేదికలో చోటు
- నీటి ఆదా, చిరుధాన్యాల సాగుపై గ్రామీణుల్లో చైతన్యం

బి.కొత్తకోట: కరువుకు నిలయమైన మారుమూల నియోజకవర్గ కేంద్రం తంబళ్లపల్లెలో సాగులో నీటి పొదుపు, భూగర్భజలాల మట్టంపై అంచనా వేసి, దాని ఆధారంగా పంటలను సాగు చేయించడంలో చేసిన కృషికి తంబళ్లపల్లెకు చెందిన టీ.పారేశమ్మకు 2021లో జాతీయస్థాయిలో ఉమెన్ వాటర్ ఛాంపియన్ అవార్డు లభించింది. అంతర్జాతీయ సంస్థ అయిన యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, కేంద్రప్రభుత్వ పరిధిలోని జాతీయ వాటర్ మిషన్ సంయుక్తంగా ప్రకటించిన ఉమెన్ వాటర్ అవార్డుకు 41 మందిని ఎంపిక చేయగా అందులో ఏపీ నుంచి పారేశమ్మ ఒకరు. తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో స్ఫూర్తిదాయక మహిళలు, మహిళా సంఘాలకు చెందిన మహిళల గురించి వెలుగులోకి తీసుకొస్తూ...శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వచ్ఛ సుజల్ శక్తి కి అభివ్యక్తి-2023 పేరుతో కేంద్రప్రభుత్వం వెలువరించిన నివేదికను ఆవిష్కరించారు. ఈ నివేదికలో నీటిసంరక్షణ, చిరుధాన్యాల సాగులో విశేష కృషి చూపిన మహిళల గురించిన ప్రస్తావనలో పారేశమ్మ చోటు సంపాదించుకున్నారు. నీటిపొదుపు, దానికి అనుగుణంగా చిరుధాన్యాల సాగుకు ఆమె చేసిన కృషికి ఈ గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా ఆమె గురించి..



పంటల సాగుపై రైతులతో సమావేశం (ఫైల్).. (ఇన్‌సెట్) టి.పారేశమ్మ

రిసోర్స్‌పర్సన్‌గా..

తంబళ్లపల్లె మండలం గోపిదిన్నెకు చెందిన పారేశమ్మ కుటుంబం తంబళ్లపల్లెలో నివాసముంటోంది. ఐటీఐ పూర్తి చేసిన పారేశమ్మ 2015 ఏడాది నుంచి గుజరాత్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎకోలాజికల్ సెక్యూరిటీ సంస్థలో రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్నారు. తంబళ్లపల్లె పంచాయతీలోని 16 పల్లెల్లో ఈమె విధులు నిర్వహిస్తూ పంటల సాగు, వనరుల సంరక్షణ, గ్రామస్తులతో సంఘాల ఏర్పాటు చేయడంపై కృషి చేస్తూ వస్తున్నారు. భూగర్భనీటి మట్టం ఆధారంగా పంటలు సాగు చేయించడంపై అవగాహన కల్పిస్తూ, రైతులను చిరుధాన్యాల సాగువైపు మళ్లించేందుకు కృషి చేశారు.

సంఘాల ఏర్పాటుతో..

తంబళ్లపల్లె పంచాయతీ (పంచాయతీ విభజనకు ముందు)లో 33 పల్లెలుండగా..పులసవాండ్లపల్లె, గోళ్లపళ్లోపల్లె, చెవిటివారిపల్లె, ఎగువబోయపల్లె, పలకవారిపల్లె, చెన్నప్పగారిపల్లె, నాయనప్పగారిపల్లె, దబ్బలగుట్టపల్లె, కురవపల్లె, మట్టావాండ్లపల్లె, బురుజు, బోడికిందపల్లె, కొండకిందమేకలవారిపల్లె, ఇట్నెనివారిపల్లె, చేలూరివాండ్లపల్లెల్లో పారేశమ్మ రిసోర్స్‌పర్సన్‌గా పనిచేశారు. రైతులు తక్కువ నీటితో పంటలను సాగుచేసేలా ప్రోత్సహించడం. రైతుకు ఉన్న పొలంలో సగం విస్తీర్ణంలో ఒక పంట, మరో సగం పొలంలో చిరుధాన్యాలైన కొర్రలు, అండ్రుకొర్రలు, సామలు, అరికెలు సాగు చేసేలా అవగాహన కల్పించి సాగు చేయించారు. ఇలా 2019-21 మధ్య రెండేళ్లల్లో 50 ఎకరాల్లో చిరుధాన్యాలను సాగు చేయించారు.

నీటినిల్వకు ప్రాధాన్యం..

రిసోర్స్‌పర్సన్‌గా పారేశమ్మ ఉపాధి హామీ పథకం పనులపైనా దృష్టి పెట్టేవారు. ఉపాధి పనుల్లో ఎక్కువగా నీటినిల్వ పనులు జరిగేలా ప్రోత్సహించడం, కూలీలు ఈ పనులు చేసేందుకు మొగ్గుచూపేలా అవగాహన కల్పించి ఫలితాలు సాధించారు. అలాగే అడవుల సంరక్షణ, భూగర్భజలాల వృద్ధికి నష్టం కలిగించే పనులకు రైతులను దూరంగా ఉండేలా చేయడంలో సఫలీకృతులయ్యారు. ఈ మార్పును తీసుకొచ్చిన తనకు కేంద్రప్రభుత్వ నివేదికలో స్థానం దక్కడంపై పారేశమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

కల్యాణ మండపంలో అద్దాలు, పైప్‌లైన్ ధ్వంసం



పగిలిన అద్దాలు

పెద్దతిప్పసముద్రం : స్థానిక కింగ్ కల్యాణ మండపంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గోడకు అమర్చిన అద్దాలను బీరు బాటిళ్లతో పగుల గొట్టారని యజమాని డాక్టర్ ఇలియాజ్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. అనుమానాస్పద వ్యక్తులు గోడ దూకి కల్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను కూడా ధ్వంసం చేశారన్నారు. ఉద్దేశపూర్వకంగా చేసిన ఈ ఘటనతో తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టి మాకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : ఓ వ్యక్తి గుళిక మందుతిని ఆత్మహత్యయత్నాకి పాల్పడిన సంఘటన తంబళ్లపల్లె మండలం రెడ్డికోటలో జరిగింది. రెడ్డికోటకు చెందిన ఆంజనేయులు (27) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం కుటుంబసమస్యలపై భార్య జ్యోతితో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన గుళిక మందుతిన్నాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసునమోదు

కలకడ : ఒక వ్యక్తి అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది.వివరాలు.. మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెకు చెందిన బుక్కే. రామునాయక్ గత నెల 27వతేదీ ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఇప్పటి వరకు తిరిగి రాలేదని అతని భార్య నాగవేణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గోపాలకృష్ణ ఆదివారం తెలిపారు.

సర్వమత సన్నిధి.. నీలకంఠరావుపేట దర్గా

- ఆధ్యాత్మికతకు నిలయం
- నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

రామాపురం : ఆరు దశాబ్దాల కిందట నిర్జీవంగా ఉండి సమాధుల చుట్టూ గోడలు ఉండే ప్రదేశం. నేడు ఎందరో భక్తులకు మానసిక ఉల్లాసం కలిగిస్తూ, వారి కోర్కెలు తీరుస్తూ ఆధ్యాత్మిక నిలయంగా మారింది. అదే శ్రీ నీలకంఠ్రావుపేట దర్గా. ఇది అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలో దక్షిణ దిశగా ఒక కిలోమీటరు దూరంలో ఉంది.

హిందూ, ముస్లిం సమైక్యతకు ప్రతీకగా, పవిత్ర దర్శనీయస్థలంగా వెలుగొందుతోంది. కడప -చిత్తూరు ప్రధాన జాతీయ రహదారికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో వెలిసిన ఈ దర్గాలో ఏటా ఫల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున ఉరుసు ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుపుతారు. సద్గురు హజరత్ దర్బార్ అలీషావలీ రహంతుల్లా అలైహిబాబా, శ్రీ జలీల్ మస్తాన్‌వలీ గార్ల ఉరుసు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. దత్త పీఠానికి చెందిన మహాపూర్ణత్వ పురుషులైన వీరిద్దరు 147 సంవత్సరంలో ఈనిర్జన స్థలంలో సజీవసమాధి పొందారని పూర్వీకులు చెబుతున్నారు.నాడు వీరు నాటిన మొక్కలు నేటికీ సజీవ సాక్ష్యాలుగా మిగిలాయి. ఉరుసు సందర్భంగా మహాజెండాను ఊరేగింపుగా తీసుకెళ్లి చెట్ల వద్ద ఉంచి ఫతేహా నిర్వహిస్తారు.



సద్గురు దర్గా స్వామిజీల సమాధి

- దర్గా సన్నిధిలోనే షిర్డీ సాయినాథుని పంచలోహ విగ్రహంతో కూడిన మందిరం నిర్మించారు. అలాగే 1–10వ తరగతి వరకు సుందరమైన భవనాల్లో తరగతి గదులు ఏర్పాటు చేసి సాయి విద్యామందిరం పేరిట ఉచిత భోజనం అందిస్తున్నారు. విద్యా బోధన కొనసాగించడం గమనార్హం.
- శ్రీ దర్గా పీఠాధిపతి సద్గురు స్వామీజీకి చేదోడుగా ఉంటూ భక్తులను ఎంతో ప్రేమగా పలకరించే రంగనాయకమ్మ శివైక్యం పొందారు.తర్వాత 14 సంవత్సరాలకు సద్గురు స్వామీజీ కూడా శివైక్యం పొందారు వీరిద్దరికి మందిరం నిర్మించి, పంచలోహ విగ్రహాలు ఏర్పాటు చేసి నిత్యం పూజలు, ఏటా వార్షిక ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు.



సద్గురు హజరత్ దర్బార్ అలీషావలీరంహంతుల్లా అలైహిబాబా, శ్రీ జలీల్ మస్తాన్‌వలీ సమాధులు

నేడు ఉరుసు ఉత్సవం

శ్రీ సద్గురు హజరత్ దర్బార్ ఆలీషావలి రమతుల్లా అలైబాబా, శ్రీ జలీల్ మస్తాన్ వలీ బాబా గార్ల ఉరుసు ఉత్సవాలు ఈనెల 6వ తేది నుంచి జరుగుతాయి. 6న గంధమహోత్సవ, 7న జెండా మెరవణి, ఉరుసు, రాత్రి హిందూ, మహమ్మదీయ సోదరుల సహకారంతో ముంబైకి చెందిన ఖలీల్ సైదా, బెంగళూరుకు చెందిన అస్మాని నిఖబ్‌లతో ఖవాలీ, 8న తహలీల్ ప్రసాదం అందజేతతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.



దర్గాలోని సాయి మందిరం

ఉపాధ్యాయులపై వేధింపులు మానుకోవాలి

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయులపై వేధింపులు మానుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ సభాభవనంలో ఎస్టీయూ అన్నమయ్యజిల్లా తొలి కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఒత్తిళ్లు తాళలేక కొందరు ఉపాధ్యాయులు మృతి చెందారన్నారు. మాజీ రాష్ట్రప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, రాష్ట్రనేతలు మధుసూదన్, ఆదినారాయణరెడ్డి, శివారెడ్డి, జిల్లా నేతలు రవీంద్రనాథరెడ్డి, మహేశ్వరరెడ్డి, సనావుల్లా, అంజాద్‌బాషా, రామక్రిష్ణారెడ్డి, మున్వర్ బాష, నాగరాజు, గోపిక్రిష్ణ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

సూత్ర ధారులెవరు?

అవినీతి వీఆర్‌ఏ కోలా చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

గాలివీడు : ఇంటిపట్టాలు ఇవ్వజూపి లక్షల రూపాయలు అక్రమ వసూళ్లకు పాల్పడిన అవినీతి వీఆర్‌ఏ కోలా రమణ బాధితుల ఫిర్యాదుతో పోలీసుల ఉచ్చులో చిక్కుకున్నాడు. అక్రమ వసూళ్లలో భాగస్వాములు ఎవరు? ఇంటి దొంగలు ఎవరనే దానిపై చర్చ జరుగుతోంది. వివరాలు.. అన్నమయ్య జిల్లా, గాలివీడు మండల కేంద్రంలో తండ్రి అనారోగ్యంగా ఉన్నాడనే కారణంతో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న కోలా రమణ ప్రభుత్వ భూముల్లో నివాసస్థల పట్టాలను, అసైన్డ్ భూములను ఇప్పిస్తానని చెప్పి అక్రమంగా లక్షల రూపాయల నగదు ఫోన్ పే రూపంలో వసూళ్లకు పాల్పడినట్లు బాధితులు ఆరోపించారు. బాధితులకు ప్రాంసరీనోట్లు, స్టాంప్ పేపర్లపై తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం రుణం తీసుకున్నట్లుగా రాయించి ఇచ్చాడు. అయితే రోజులు గడిచే కొద్దీ బాధితుల సంఖ్య పెరిగింది. కానీ నివాస స్థల పట్టాలు , నగదు తిరిగి చెల్లించలేదు. దీంతో సదరు అవినీతి వీఆర్‌ఏ అసలు రంగు బయటపడింది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం అవినీతి వీఆర్‌ఏను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో తమ పేర్లు ఎక్కడ బయటకొస్తాయోనని స్థానిక రెవెన్యూ అధికారుల గుండెలలో గుబులు మొదలైంది. తమశాఖ పరువు ఎక్కడ పోతుందోనని అవినీతి భాగస్వాముల పేర్లు బహిర్గతం కాకుండా గుట్టుగా ఉంచేందుకు అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. వెంటనే సమగ్ర విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాల్సిన బాధ్యత పోలీస్ యంత్రాంగంపై ఉందని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.



అవినీతికి పాల్పడిన వారిపై విచారణ చేపట్టాలని నినాదాలు చేస్తున్న బాధితులు

విజిలెన్స్ అధికారుల దాడులు

కడప అర్బన్ : వైఎస్సార్‌జిల్లా కడప నగరం, మైదుకూరు పట్టణంలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం కడప నగరం, మైదుకూరు పట్టణాలలో చికెన్, మటన్,చేపలు అమ్ముతున్న 43 దుకాణాలపై దాడులను నిర్వహించారు. తూనికలు, కొలతలలో పలు ఉల్లంఘలనపై తూకాలు తక్కువ ఉండటం, అనుమతులు లేని తక్కెడలను ఉపయోగించడం, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌లకు స్టాంపింగ్ లేకుండా ఉండటాన్ని గుర్తించారు. 14 కేసులను నమోదు చేసి లీగల్ మెట్రాలజీ సెక్షన్ 8/25, 2009 ప్రకారం జరిమానా విధించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు ఇన్‌స్పెక్టర్లు టి.. రెడ్డెప్ప, పి. రామకృష్ణ, డిప్యూటీ ఈఈ లోకేశ్వర్ రెడ్డి, ఏజి జి. శ్రీనివాసులు, ఏఓ బాలగంగాధర్ రెడ్డి, ఏఈఈలు కిశోర్ కుమార్, వి. అశోక్‌కుమార్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, జయదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం: రూ.20 లక్షల ఆస్తినష్టం

నాలుగు కార్లు దగ్ధం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం పుంగనూరురోడ్డులోని బసినికొండ దర్గా వద్ద ఉన్న మెకానిక్ షెడ్లలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదంలో నాలుగు వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. మరో మూడు వాహనాలు పాక్షికంగా దెబ్బతినగా సామగ్రి కాలి బూడిదైంది. షెడ్లలో కార్మికులు పని ముగించుకుకి ఇంటికి వెళ్లారు.షెడ్ల వెనుకవైపు ఉన్న మైదానంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగాయి. మహబూబ్‌బాషాకు చెందిన షెడ్డులో మూడు కార్లు, మహీంద్ర జీపు పూర్తిగా కాలిపోయింది. దీంతో పాటు షెడ్డులోని మెకానిక్ సామగ్రి, ఆయిల్ టిన్నులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మరో మూడు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. పక్కనే ఉన్న మూడు షెడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. సంఘటన స్థలానికి మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి చేరుకుని బాధితులను ఓదార్చారు. వెంటనే మున్సిపాలిటీ వాటర్ ట్యాంకులను తెప్పించి మంటల అదుపునకు సహకరించారు. ప్రమాద విషయాన్ని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాల దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామన్నారు. బాధితులకు అండగా ఉంటామన్నారు. వేసవి దృష్టిలో ఉంచుకుని మెకానిక్ షెడ్ల వద్ద శుభ్రంగా ఉంచుకోవాలని అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి పురుషోత్తమనాయుడు తెలిపారు.



కాలిపోయిన మెకానిక్ షెడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటా చలపతి

బైక్ దొంగ పోలీసులకు అప్పగింత

జమ్మలమడుగు : బైక్ ఎత్తుకెళ్లిన ఓ యువకుడిని గ్రామస్తులు పట్టుకుని ఆదివారం తలమంచిపట్నం పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన యువకుడు నంద్యాల జిల్లా సంజామల మండలం రామిరెడ్డి పల్లెకు చెందినవాడిగా గుర్తించారు. స్థానికుల కథనం మేరకు వైఎస్సార్‌జిల్లా మెలవరం మండలం వద్దిరాల గ్రామానికి చెందిన షట్కారీ గురు గంగాధర్ స్నేహితులతో కలసి ఆదివారం చేపలు పట్టడానికి వెళ్లారు. బైక్‌ను వద్దిరాల– గొళ్లపల్లి ప్రధాన రహదారిపై నిలిపారు. తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు.దీంతో అక్కడ ఉన్నవారితో మాట్లాడగా ఇప్పుడే ఓ యువకుడు బైక్ తీసుకెళ్లారని చెప్పారు. వెంటనే వేరే వాళ్ల బైక్ తీసుకెళ్లి వెతకడం ప్రారంభించారు. ఓగ్రామం వద్ద బైక్‌తో ఉన్న యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై మైలవరం ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణను వివరణ కోరగా వద్దిరాల గ్రామస్తులు యువకుడిని అప్పగించింది వాస్తవమే అన్నారు. అయితే అతడికి మానసిన పరిస్థితి బాగా లేక పోవడంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న విచారణ తెలిసిందన్నారు. యువకుడిపై బైండోవర్ కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



కూరగాయల అలంకరణలో గంగమ్మ తల్లి



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్‌జిల్లా కొత్తపేట – బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జాతర వారాల్లో భాగంగా రెండో ఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామున 3 గంటల నుంచి బారులు తీరారు. ట్రాక్టర్లు, ఎండ్ల బండ్లపై తరలి వచ్చారు. ఆలయ ఆవరణలోని వీరభద్ర స్వామి, అంజనేయ స్వామి, సాయిబాబాలకు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో సురేష్ కుమార్ ఏర్పాట్లను చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీకేదిన్నె ఎస్ఐ బి. అరుణ్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

లారీ బోల్తా: ఇద్దరికి గాయాలు

వల్లూరు: కడప – తాడిపత్రి ప్రధాన రహదారిపై వల్లూరు – కొప్పోలు బస్టాపుల మధ్య ఆదివారం తెల్లవారు జామున అదుపు తప్పి కోళ్ల లోడుతో వస్తున్న లారీ బోల్తా పడింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు పుంగనూరు నుంచి కోళ్లను లోడు చేసుకుని కమలాపురం వస్తున్న లారీ వల్లూరు సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ , క్లీనర్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా కోళ్లు అధిక సంఖ్యలో మృతి చెందాయి.

కారుబైక్ ఢీ: ఒకరి మృతి



మృతి చెందిన శివశంకర్ (ఫైల్)

రైల్వేకోడూరు రూరల్ : రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ కొత్త మంగంపేట వద్ద కడప – తిరుపతి జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓబులవారిపల్లె మండలం ముదినేపల్లికి చెందిన మాచుపల్లి శివశంకర్(21) అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... రైల్వేకోడూరు మండంలోని తుంగావాండ్లపల్లె నుంచి బావ బావమరుదులైన మాచుపల్లి శివశంకర్, శ్రీనివాసులు ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంలో పని నిమిత్తం పుల్లంపేట మండలం రెడ్డిపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలో కొత్త మంగంపేట వద్దకు రాగానే కడప నుంచి తిరుపతి వెళుతున్న ఓ కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టి ఎదురుగా కడప వైపు వెళుతున్న ఆర్‌టీసీ బస్సును కూడా ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న శివశంకర్ మృతి చెందగా ఆయన బావ శ్రీనివాసులు గాయపడ్డారు. కారు నుజ్జునుజ్జు అయింది. చిత్తూరుకు చెందిన పద్మనాభం, సురేష్‌లు కారులోనే ఇరుక్కు పోయి అపస్మారకస్థితికి చేరుకున్నారు. స్థానికులు గడ్డపారలు, బలమైన తాళ్ల సహాయంతో కారు తలుపులను లాగి వారిని బయటకు తీశారు. 108లో రైల్వేకోడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్సలు నిర్వహించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేటకు తరలించారు.కేసు నమోదు చేశారు.

ముదినేపల్లిలో విషాదఛాయలు

ముదినే పల్లి గ్రామానికి చెందిన రత్నమ్మ చంగ్రాయుడు దంపతులకు శివశంకర్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శివశంకర్ ఐటీఐ పూర్తి చేశాడు.ప్రస్తుతం అమ్మమ్మ గారి గ్రామమైన తుంగావాండ్లపల్లెలో ఉండేవాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు







గాయపడిన తుంగా శ్రీనివాసులు, పద్మనాభం, సురేష్

పార్శిల్ ఇచ్చి తిరిగి వస్తూ..



ఆంజనేయులు(ఫైల్)

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయరహదారిపై దేవపట్ల మిట్ట సమీపంలో ఆదివారం బైక్, కారు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రాయచోటి మండలం మద్దిరవాండ్లపల్లె హరిజనవాడకు చెందిన చిట్లూరి ఆంజనేయులు (20) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ఆంజనేయులు రాయచోటిలోని ఓ కళాశాలలో చదువుకుంటూ ఫ్లిప్‌కార్ట్‌లో కొరియర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో దేవపట్లలో పార్సిల్ ఇచ్చేసి రాయచోటికి వెళుతుండగా దేవపట్ల మిట్ట సమీపంలోని హోటల్ వద్దకు రాగానే పీలేరు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగ గాయపడిన అంజనేయులను 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి వివాహంకాలేదు. తల్లి, దండ్రులు గతంలో చనిపోయినట్లు సమాచారం. ఆంజనేయులుకు ముగ్గురు సోదరులున్నారు. అన్న మృతి చెందడంతో సోదరులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య



పెంచలమ్మ మృతదేహం

పెనగలూరు : మండలంలోని కంబాలకుంట హరిజనవాడకు చెందిన గానుగొపెంట పెంచలమ్మ (65) అనే వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు పెంచలమ్మ అనారోగ్య సమస్యలతో ఈనెల 4వ తేదీ రాత్రి బెస్తపల్లి సమీపంలోని రహదారిలో విషద్రావణం తాగి కంపచెట్ల మధ్యలో పడి ఉంది. పెంచలమ్మ కుమార్తె సుబ్బమ్మకు సమాచారం అందించారు.వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక..

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని దిన్నెపాడు పంచాయతీలోని దిన్నెమీద పల్లికి చెందిన మేఘన (19) అనే వివాహిత ఆదివారం విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ వినోద్ కుమార్ కథనం మేరకు మేఘనకు ఇటీవలే వివాహం జరిగింది. తరచూ కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది. ఆదివారం నొప్పి ఎక్కువగా రావడంతో తట్టుకోలేక విషద్రావణం తాగింది. వెంటనే ఆమెను తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

'భారతి సిమెంట్స్'కు ఫైవ్ స్టార్ రేటింగ్

కమలాపురం : వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం నల్లింగాయపల్లెలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)కు ఫైవ్ స్టార్ రేటింగ్ వచ్చినట్లు ప్లాంట్ సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 1వ తేదీన నాగ్‌పూర్‌లో జరిగిన ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ 75వ వార్షికోత్సవ వేడుకలలో కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద జోషి చేతుల మీదుగా ఈ అవార్డును సీఎంఓ సాయి రమేష్, మైన్స్ జీఎం సుధాకర్ రాజు, చీఫ్ మేనేజర్ భార్గవ్ రెడ్డి అందుకున్నారు.

బీసీసీపీఎల్‌కు చెందిన లైఫ్ స్టోన్ మైన్స్‌కు, అలాగే సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌కు గాను ఈ అవార్డు లభించినట్లు ఆయన వివరించారు. మైన్స్‌లో అవలంభించిన సైంటిఫిక్ పద్ధతులు, మైన్స్ కన్జర్వేషన్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగంలో 2021–22 సంవత్సరానికి ఈ అవార్డు లభించిందని సీఎంఓ తెలిపారు. ఇందుకోసం కృషి చేసిన పలు విభాగాల కార్మికులకు ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరింత ఉత్సాహంతో పనిచేస్తామని ఆయన అన్నారు.



కేంద్ర గనుల శాఖ మంత్రి జోషి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బీసీసీపీఎల్ ప్రతినిధులు